www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 19 ఫిబ్రవరి 2023
5
వైఎస్ఆర్



పిడిఎఫ్ అభ్యర్థి నామినేషన్‌కు తరలిరండి

ప్రజాశక్తి కడప అర్బన్

పిడిఎఫ్ (ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్) ఎంఎల్‌సి అభ్యర్థి డాక్టర్ పోతుల నాగరాజు నామినేషన్ కార్యక్రమానికి హాజరుకావాలని సిఐటియు నాయకులు శ్రీనివాసులురెడ్డి పిలుపునిచ్చారు. శనివారం లయన్స్ క్లబ్ ఆఫ్ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు డాక్టర్. ఆర్.రంగనాథరెడ్డి, ఇన్సూరెన్స్ బ్రాంచ్ మేనేజర్ శివశంకర్ రెడ్డి, కె.వి.రమణరెడ్డి ,సుబ్బారాయుడుకు ఆహ్వాన పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 22, ఉదయం 10 గంటలకు అనంతపురం ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ ఉంటుందని, తప్పకుండా హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. మిత్రులకు, శ్రేయోభిలాషులకు, ఉద్యోగ, ఉపాధ్యాయులకు, విద్యార్థులకు, నిరుద్యోగులకు, మహిళా సంఘాలకు, న్యాయ వాదులకు, ప్రజాసంఘాల నాయకులకు, కాంట్రాక్టు ఉద్యోగులకు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు, రచయితలకు, మేధావులకు, ఉద్యమ నేతలు హాజరుకావాలని పిలుపునిచ్చారు.

బిల్లు.. గోల్లు!

- రూ.126 కోట్లతో జగనన్న కాలనీల్లో వసతులు
- రూ.44 కోట్ల మేర పైప్‌లైన్ పూర్తి
- రూ.1.85 కోట్లు బకాయి పెండింగ్
- 54 శాతంలోపే గ్రౌండింగ్

జిల్లాలో జగనన్న మౌలిక వసతుల బిల్లులు అందడం లేదు. ఏడాది కింద రూ.126.77 కోట్లతో జిల్లాలోని 499 లేఅవుట్లలో జగనన్న కాలనీలను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి నేటి వరకు 54 శాతం మాత్రమే పనుల్ని పూర్తి చేసింది. ఇందుకు గానూ రూ.44.66 కోట్ల చెల్లింపులు చేసింది. ఇందులో రూ.1.85 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో లబ్ధిదారులు, కాం ట్రాక్టర్లు బిల్లుల చెల్లింపుల విషయంలో గొల్లుమని వాపోతుండడం నిత్యకృత్యంగా మారింది. ఇందుకు ఉదాహరణ గత జిల్లా పరిషత్ సమావేశంలో పలువురు జిల్లా పరిషత్ సభ్యులు బిల్లులపై నిలదీసిన సంగతి తెలిసిందే.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలోని 35 మండలాల పరిధిలోని 499 లేఅవుట్లలో జగనన్న కాలనీలను ఏర్పాటు చేశారు. హౌసింగ్ శాఖ ఆధ్వర్యంలో 1.06 వేల మందికి ఇళ్లను కేటాయించారు. 2024 సార్వత్రిక ఎన్నికల నాటికి జగనన్న కాలనీలను ఆదర్శ కాలనీలుగా తీర్చిదిద్దాలనే సంకల్పించింది. ప్రభుత్వం పెద్దఎత్తున మౌలిక వసతుల కల్పనకు శ్రీకారం చుట్టింది. ప్రధానంగా తాగునీటి సరఫరా వ్యవస్థను ఏర్పాటు చేయడం, ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇవ్వడం, విద్యుత్ లైనింగ్, రహదారులు, ఇతర సదుపాయాలను చేపట్టింది.

266 పనులే పూర్తి

జిల్లాలోని 499 లేఅవుట్లలో 496 పనులు చేపట్టాల్సి ఉంది. ఏడాది కిందటి నుంచి నేటి వరకు 266 పనుల్ని మాత్రమే పూర్తి చేసింది.



ఈలెక్కన పూర్తి చేసిన పనుల ప్రోగ్రెస్‌ను పరిశీలిస్తే 54 శాతం పనుల్ని మాత్రమే పూర్తి చేసినట్లు తెలుస్తోంది. మిగిలిన 46 శాతం పనుల్లో మరో 160 పనులు గ్రౌండింగ్‌కు నోచుకోకపోవడం ఆందోళన కలిగిస్తోంది. మిగిలిన వాటిల్లో 70 పనులు మాత్రమే ప్రో గ్రెస్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. ఈలెక్కన జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాల ప్రక్రియను ఎప్పుడు పట్టాలకు ఎక్కిస్తారో తెలియడం లేదు.

1,07,419 మీటర్ల పైప్‌లైన్

జిల్లాలోని 499 జగనన్న కాలనీల్లో 1,07,419 మీటర్ల మేర పైప్‌లైన్ ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. 354 బోర్లను ఏర్పాటు చేయాలని ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీరింగ్ యంత్రాంగం నిర్ధారించింది. 323 బోర్లకు మోటార్లను సైతం ఏర్పాటు చేసింది. వీటిల్లో 21 బోర్లు ఏర్పాటు చేయాల్సి ఉన్నట్లు తెలుస్తోంది. 323 బోర్లతో అనుసంధానం చేసిన పైప్‌లైన్ పనుల ఆధారంగా 73 శాతం వరకు కుళాయిలు ఏర్పాటు చేసినట్లు ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు పేర్కొంటున్నారు. ఈ లెక్కన 23 శాతం ఇళ్లకు ఇంటింటికీ కుళాయిలను ఏర్పాటు చేయలేదని తెలుస్తోంది. వీటిని ఎప్పుడు పూర్తి చేస్తారో వేచి చూడాల్సి ఉంది.

పెండింగ్ బిల్లుకు మోక్షమెప్పుడో!

జిల్లాలోని 499 లేఅవుట్లలో చేపట్టిన మౌలిక వసతుల కల్పన పనులకు రూ.126.77 కోట్లు కేటాయించింది. జిల్లా ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీరింగ్ యంత్రాంగం తాగునీటి పనుల నిమిత్తం రూ.44.66 కోట్లు మేరకు ఖర్చు చేసింది. రూ.1.85 కోట్లు బిల్లులు చెల్లింపులకు నిరీక్షించాల్సివస్తోంది. దీనిపై ఇటీవలి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు బిల్లుల చెల్లింపుల అంశంపై నిలదీయడం తెలిసిందే. బిల్లుల చెల్లింపుల్లో ఆలస్యం కావడం ఒకవైపు ఉండగా మరోవైపు అధికారుల్లో బిల్లుల విషయంలో లబ్ధిదారులు, కాంట్రాక్టర్లకు సమాధానాలు చెప్పలేని పరిస్థితి ఏర్పడింది. ఏదేమైనా రాష్ట్రప్రభుత్వం సంకల్పించిన జగనన్న ఇళ్ల కాలనీల స్వప్నం సాకారం కావాలంటే సత్వరమే బిల్లులు చెల్లింపు లు చేయాలి. ప్రస్తుత వేసవి సీజన్‌లో జగనన్న ఇళ్ల నిర్మాణ పనుల్ని మౌలిక వసతుల కల్పనను వేగవంతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సత్వరమే చెల్లింపులు

జగనన్న ఇళ్ల కాలనీలో తాగునీటి సరఫరా పనులకు సత్వరమే చెల్లింపులు చేస్తాం. ఇప్పటి వరకు రూ.44.66 కోట్లను ఖర్చు చేశాం. రూ.1.85 కోట్ల మేర చెల్లింపులు పెండింగ్ ఉన్నాయి. మిగిలిన పనుల్ని సైతం వేగవంతంగా పూర్తి చేసే ప్రయత్నంలో ఉన్నాం.

- వీరన్న, ఆర్‌డబ్ల్యుఎస్, ఎస్ఇ, కడప.



భక్తులతో కిటకిటలాడుతున్న పొలతల క్షేత్రం

శైవక్షేత్రాల్లో పోటెత్తిన భక్తజనం

జిల్లాలోని శైవక్షేత్రాలు దర్శనం కోసం వచ్చిన భక్తులతో తెల్లవారుజాము నుంచే కిటకిటలాడాయి. అటవీ ప్రాంతాల్లోని శైవ క్షేత్రాలకు జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున భక్తులు కుటుంబాలతో సహా తరలి వెళ్లారు. లక్షలాది జనం రావడంతో కొండకోనలు రద్దీగా మారాయి. ఓ దశలో అడుగు తీసి అడుగు వేసేందుకు కూడా కష్టమైంది. అయినా భక్తులు అడుగడుగునా శివనామ స్మరణతో ఉత్సాహం తెచ్చుకుంటూ ఆ శ్రమను మరిచారు. ప్రసిద్ధి శైవక్షేత్రం పొలతల భక్తులతో పోటెత్తింది. జిల్లా నలుమూల నుంచే కాకుండా కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి భక్తులు లక్షల సంఖ్యలో తరలివచ్చి మల్లేశ్వరస్వామి, పార్వతిదేవి, అక్కదేవతలు, పులిబండెన్న స్వాముల వారిని దర్శించుకున్నారు.

6లో

ప్రభుత్వానికి పోగాలం వచ్చింది

-టిడిపి నేతలు సోమిరెడ్డి, శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి కడప అర్బన్

విభజన ఆంధ్ర ప్రదేశ్ తొలి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటనను అడ్డుకుంటున్న వైసిపి ప్రభుత్వానికి పోగాలం వచ్చిందని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, శ్రీనివాస రెడ్డి మండిపడ్డారు. ఈనెల 25న చంద్రబాబు విచ్చేసే రాయలసీమ జోన్ సమావేశ సభాస్థలిని, కడప ఎయిర్‌పోర్టు సమీప ప్రాంతాన్ని శనివారం టిడిపి నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబుకు వస్తున్న ప్రజాదరణను చూసి జగన్ జీర్ణించుకోలేని పరిస్థితి అన్నారు. చంద్రబాబు అనపర్తిలో సమావేశం నిర్వహించుకునేందుకు ఈ ప్రభుత్వానికి అభ్యంతరం ఏమిటని ప్రశ్నించారు. టిడిపి హయాంలో వై.ఎస్ .రాజశేఖర్ రెడ్డి, వైఎస్ జగన్మోహన్ రెడ్డి, షర్మిల పాదయాత్రలు చేసినప్పుడు అడ్డుకున్నామా అని గుర్తు చేశారు. ఆనాడు స్వాతంత్య్రం కోసం ప్రాణత్యాగాలు చేశారని, ఇప్పుడు రాష్ట్రంలో అదే పరిస్థితి ఉందన్నారు. రాష్ట్రంలో నియంత పాలన కొనసాగుతుందని, ప్రజాస్వామ్యం కోసం పోరాడాల్సిన కర్మ దాపురించిందని చెప్పారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని, బుద్ధి చెప్పడం ఖాయమని హెచ్చరించారు. టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నికల కోడ్ ఉందని చెప్పి, ఒక్కో ఊరిలో ఒక్కో రాజ్యాంగాన్ని జగన్ అమలు చేస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు పర్యటనను, లోకేష్ పాదయాత్రను ఈ ప్రభుత్వం అడ్డుకుంటుందని చెప్పారు. తెలుగుదేశం అధికారులకు వచ్చాక మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు.

నేడు భూతపురి 86వ జయంతి

కడప అర్బన్ : 'మహాకవి' 'శతావధాని' డాక్టర్ భూతపురి సుబ్రహ్మణ్య శర్మ మెమోరియల్ ట్రస్ట్, అల్లసాని పెద్దన సాహిత్యపీఠం ఆధ్వర్యంలో ఈనెల 19న ఉదయం 10 గంటలకు భూతపురి 86వ జయంతి, 21వ సాహిత్య పురస్కార ప్రదానోత్సవాన్ని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు ట్రస్టు అధ్యక్షులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, కార్యదర్శి డాక్టర్ భూతపురి శివరామ సురేంద్ర శర్మ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. డాక్టర్ భూతపురి సుబ్రహ్మణ్యశర్మ బహుముఖ ప్రతిభాశాలి అని, కవిగా, అవధానిగా, జ్యోతిష వాస్తు శాస్త్రజ్ఞులుగా రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాలలో పేరుప్రతిష్ఠలు సంపాదించుకున్నారని పేర్కొన్నారు.

'ఆప్' సభ్యత్వ నమోదు

కడప అర్బన్ : నగరంలోని ఏడురోడ్ల సర్కిల్‌లో ఆమ్ ఆద్మీ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని కడప ఆప్ పార్లమెంట్ కంటెస్టెంట్, జిల్లా అధ్యక్షులు సాజిద్ హుస్సేన్ ఆధ్వర్యంలో శనివారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యూఢిల్లీ ముఖ్యమంత్రిగా అరవింద్ కేజ్రీవాల్ అద్భుతమైన సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. వారి చేస్తున్న సేవలు మన రాష్ట్రంలో కూడా అమలు అవ్వాలంటే ఆమ్ ఆద్మీ పార్టీకి ఒక్క ఛాన్స్ ఇవ్వాలని కోరారు. నగరంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించామని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గం నుంచి పోటీ చేయనున్నామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కో-ఆర్డినేటర్ రహమతుల్లా, జిల్లా ఉపాధ్యక్షులు దస్తగిరి, జిల్లా నాయకులు వెంకటరెడ్డి పాల్గొన్నారు.

భాషాభివృద్ధిపై ఆశలు

కడప అర్బన్ : ప్రభుత్వం ఇటీవల అధికార భాషా సంఘానికి అధ్యక్షులు, సభ్యులను నియమించడంతో రాష్ట్రంలో తెలుగు భాషాభివృద్ధిపై ఆశలు పెరుగుతున్నాయని సాంఘిక సంక్షేమశాఖ అధికారి డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య అన్నారు. శనివారం రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ కార్యదర్శి కొండూరు జనార్దన రాజు, లయన్స్ క్లబ్ ఆఫ్ కడప, అన్నమయ్య సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక గ్రాండ్ ఇన్ హోటల్‌లో తవ్వా వెంకటయ్యకు అభినందన సభ ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన బ్రహ్మయ్య మాట్లాడుతూ ప్రభుత్వం తెలుగుభాష అభివృద్ధిని ఏమాత్రం విస్మరించలేదని చెప్పారు. కలెక్టర్ ఆధ్వర్యంలో వెంకటయ్య జిల్లాలో భాషాభివృద్ధికి కృషి చేయగలరని ఆశిస్తున్నామన్నారు. సభాధ్యక్షులు, పాస్ట్ గవర్నర్ లయన్ మానస చిన్నపరెడ్డి మాట్లాడుతూ చిన్న వయస్సులో పెద్ద పదవి రావడం వెంకటయ్య లాంటి నిత్య సాహితీ కృషీవలునికి తగిన పదవి ఇచ్చినట్లయిందని చెప్పారు. లయన్స్ జిల్లా అధ్యక్షులు ఆర్.రంగనాథరెడ్డి, లయన్ పోతుల వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ ప్రతినెలా జిల్లాలో తెలుగుభాషాభివృద్ధి కోసం పాఠశాలల్లో అవగాహన తరగతులు నిర్వహించాలని, ఇందుకు తాము తప్పక సహకరిస్తామని తెలిపారు. అనంతరం తవ్వా వెంకటయ్యను ఘనంగా సత్కరించారు.

వెండి ఆభరణాల ప్రదర్శన

కడప అర్బన్ : మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూంలో ఈనెల 27 వరకు వెండి ఆభరణాల ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు షో రూమ్ మేనేజర్ పేర్కొన్నారు. శనివారం మహిళల చేత వెండి ఆభరణాల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ. 5 వేల విలువచేసే వెండి ఆభరణాల కొనుగోలు పై రూ. 500 తగ్గింపు ఇస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



వెండి ఆభరణాలను ప్రదర్శిస్తున్న మహిళలు

నేడు ఎస్ఐ ఉద్యోగాల ప్రిలిమినరీ పరీక్ష

ప్రజాశక్తి-కడప అర్బన్

నగరంలో ఈనెల 19న నిర్వహించబోయే ఎస్ఐ ఉద్యోగాల ప్రిలిమినరీ రాత పరీక్షకు పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఎస్‌పి కె.కె. అన్బురాజన్ పేర్కొన్నారు. పరీక్ష ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ, మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5:30 వరకు ఉంటుందని తెలిపారు. పరీక్షల సమయం కంటే గంట ముందే అభ్యర్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారని పేర్కొన్నారు. నిర్ణీత సమయానికి ఒక నిముషం ఆలస్యంగా వచ్చినా అనుమతించరని, అభ్యర్థులు గమనించాలని తెలిపారు. నగరంలో ఏర్పాటు చేసిన 11 పరీక్షా కేంద్రాలలో మొత్తం 9540 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని పేర్కొన్నారు. 11 కేంద్రాలను నాలుగు రూట్లుగా విభజించి బందోబస్త్ ఏర్పాటు చేశామని తెలిపారు. అభ్యర్థులు తప్పనిసరిగా హాల్ టికెట్ వెంట తీసుకురావాలని పేర్కొన్నారు. దీంతో పాటు ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, ఓటర్ గుర్తింపు కార్డు, పాన్ కార్డు గుర్తింపు కార్డులలో ఏదో ఒకటి ఒరిజినల్ తీసుకురావాలని తెలిపారు. సెల్ ఫోన్, వాచ్, ఎలక్ట్రానిక్ వస్తువులను ఎట్టి పరిస్థితుల్లో అనుమతించరని పేర్కొన్నారు. మాల్ ప్రాక్టీస్, కాపీయింగ్ అక్రమాలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎగ్జామ్స్ సెంటర్ల వద్ద డిఎస్‌పి స్థాయి అధికారి నేతృత్వంలో ఫ్లయింగ్ స్క్వాడ్‌ల ద్వారా పర్యవేక్షణ ఉంటుందన్నారు. పరీక్ష కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద సిసి కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు.

ఉరుసు ఉత్సవాల్లో అన్నదానం

కడప అర్బన్ : నగరంలోని చిలకల బావి వద్ద ఉన్న హజరత్ మగరిబ్ షావలి చిస్తివుల్ ఖాద్రీ ఉరుసు మహోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా సయ్యద్ సలావుద్దీన్ అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈదర్గా ఉరుసు ఉత్సవాలను ప్రతిఏటా ఘనంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సయ్యద్ కరిముల్లా, అమ్జాద్, నూర్, అమీర్, మౌల, ఇంతియాజ్, సమ్మద్, అర్ఫాత్ పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న సలావుద్దీన్

'స్వప్నమే'

ప్రజాదృష్టి

జిల్లాలో సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు డిమాండ్ నిత్యనూతనత్వాన్ని సంతరించుకో నుంది. కేంద్రంలోని బిజెపి సర్కారు ఫీజుబిలిటీ పేరుతో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయడానికి దగా చేయడం విశ్వాసఘాతుకం. ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయడంలో కీలకమైన ముడిఖనిజాల్లో ముడి ఇనుప ఖనిజం, డోలమైట్ వంటి మూలకాలు జిల్లా, రాష్ట్ర సరిహద్దుల్లో పెద్దమొత్తంలో పోగుపడిన సంగతి తెలిసిందే. లాభాల సాధనలో కీలకమైన వనరులు అందుబాటులో ఉండి, ప్రపంచంలో రియల్ ఎస్టేట్ రంగం మొదలుకుని నిర్మాణ పనుల కార్యకలాపాలు విస్తరించిన నేపథ్యంలో ఉక్కు డిమాండ్ ఏర్పడింది. ఇటువంటి సమయంలో మరిన్ని ఉక్కు పరిశ్రమలను ఏర్పాటు చేయడం ఎంతో కీలకమని సర్వేలు చెబుతుండగా, బిజెపి సర్కారు ఫీజుబులిటీ పేరుతో దోబూచులాడడంలోని మతలబే మిటో తెలియడం లేదు. రాయలసీమ పట్ల ఎంతో ప్రేమను ఒలకబోసి రాయలసీమ డిక్లేషన్ ఆవిష్కరించిన నాయకు లేమయ్యారో తెలియడం లేదు. జాతి భవిష్యత్‌కు సంబంధించిన కీలక అంశాల పట్ల రాజకీయాలు చేయడం విస్మయాన్ని కలిగిస్తోంది. కేంద్ర సర్కారు ఫీజులిటీ అంశాన్నే తీసుకుంటే, ప్రయి వేటు పరిశ్రమాధి పతులకులేని ఫీజుబిలిటీ ప్రభుత్వ సంస్థల ఏర్పాటులో ఎందుకు అవస రం ఏర్పడిందో సమాధానం చెప్పాల్సి. రాష్ట్ర విభజనకు ముందే 2009లోనే బ్రహ్మణీ పేరుతో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు అవసరమైన 40 శాతం పనుల్ని పూర్తి చేసినప్పుడు, ప్రభుత్వ రంగంలో ఉక్కు పరిశ్రమను ఎందుకు ఏర్పాటు చేయరో ప్రశ్నించాలి. సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటుతో సామాజిక న్యాయం సంతరించుకునేదని నిస్సందేహంగా చెప్పుకోవచ్చు. ప్రయివేటు రంగంలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయడం వల్ల సామాజిక అంత రాలను మరింత పెంచడానికే తోడ్పడుతుందని ప్రత్యేకంగా చెప్పన వసరం లేదు. ఫీజుబిలిటీ లేనిచోట ప్రయివేటు రంగంలో పరిశ్రమ ఏర్పాటుకు ఎందుకు అనుమతి ఇచ్చిందో చెప్పాలి. బ్రహ్మణీ దగ్గర నుంచి జిఎస్‌డబ్ల్యు పరిశ్రమాధితులు లాభం లేనిచోట పరిశ్రమ కాదు ఒక్క పైసాను కూడా పెట్టుబడిగా పెట్టడానికి ముందుకు రారనే సంగతి జగమెరిగిన సత్యం. ఇటువంటి ఫీజుబిలిటీ లేని ప్రాంతంలో ప్రయివేటు రంగానికి వచ్చే లాభాలు, సెయిల్ ఆధ్వ ర్యంలోని ప్రభుత్వరంగ ఉక్కు పరిశ్రమ వంటి సంస్థల ఎందుకు లాభాలు రావో ఆలోచించుకోవాలి. దీన్నిబట్టి మనకు బోధపడే దేమిటి? కేంద్రంలోని బిజెపి సర్కారు యొక్క విధానం ప్రయివేటు, కార్పొరేట్ సంస్థలకు ఉదారంగా దోచిపెట్టడమనేది బహిరంగ రహస్యం. అందుకే సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయడం లేదనేది నిర్వివాదాంశం. దేశం లోని 30 రాష్ట్రాలు, ఆరు కేంద్ర పాలిత ప్రాంతాల్లో అత్యంత వెనకబడిన ప్రాంతమని శ్రీకృష్ణ కమిషన్, శివరామృష్ణన్ కమిటీలు సహా ఇతర సంఘాలు నిర్ధారించిన సంగతి తెలిసిందే. ఇటువంటి వెనుక బడిన ప్రాంతాల్లో శాశ్వత అభివృద్ధి ప్రణాళికల్ని అమలు చేయకుండా, నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం దుర్మార్గం. ఇటువంటి పాలకుల విధానాల కారణంగా దేశంలోని 40 శాతం ప్రజల సంపద ఒక్క శాతం కార్పొరేట్ల దగ్గర, మూడు శాతం మంది కార్పొరేట్ల దగ్గర 55 శాతం ప్రజల ఆదాయం పోగుపడిందని మొత్తుకుంటున్నప్పటికీ పట్టడం లేదు. కదలని చలనం లేని పాలకుల నిష్క్రియాపరత్వం కారణంగా సామాజిక అసమానతలు పెచ్చరిల్లుతుండడం విషాదకరం. మహారాష్ట్రలోని ముంబై, కర్నాటకలోని విజయనగర, గుజరాత్ వంటి రాష్ట్రాల్లో ఏర్పాటు చేసిన ఉక్కు పరిశ్రమల తరహాలో కడప జిల్లాలో ఏర్పాటు చేయనున్న ఉక్కు పరిశ్రమకు కీలకమైన ముడిసరుకు కడప, అనంతపురం, పూర్వ ఎపి ప్రాంతమైన బళ్లారిలో ఐరన్‌ఓర్ గనులు, డోలమైట్ వంటి ముడిఖనిజాలు ఉన్న నేపథ్యంలో ఎందుకు ఏర్పాటు చేయడం లేదో ప్రజలే ఆలోచించుకోవాలి. లాభాల్లో నడుస్తున్న ఎల్ఐసి, రైల్వేలు వంటి నవరత్న కంపెనీలను ప్రయివేటు మానిటైజేషన్ పైప్‌లైన్ రూపంలో తెగనమ్ముతోంది. ఇటువంటి కేంద్ర పాలకులు ప్రభుత్వ రంగంలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేస్తారనుకోవడం ఎండమావుల్లో నీటిని వెతకడం లాంటిదే కదా ఆలోచించండి.

- ప్రజాశక్తి - కడపప్రతినిధి



సమావేశంలో మాట్లాడుతున్న సుంకేసుల బాదుల్లా

దూదేకులకు ఎమ్మెల్సీ సీటు కేటాయించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

దూదేకుల ముస్లిం సోదరులకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఒక ఎమ్మెల్సీ సీటు కేటాయించాలని దూదేకుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకేసుల బాదుల్లా కోరారు. శనివారం సంఘం కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్టంలో దాదాపు 20 లక్షల జనాభా ఉన్నప్పటికీ స్వాతంత్ర్య భారతదేశంలో ఇప్పటికీ చట్టసభల్లో దూదేకులకు ప్రవేశం కల్పించలేదని చెప్పారు. చట్టసభల్లో ప్రవేశం లేని జాతి భవిష్యత్తులో అంతరిస్తుందని డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ చెప్పారని పేర్కొన్నారు. తమ సమస్యలు, బాధలు చెప్పేందుకు ఒక ప్రతినిధి కావాలి కాబట్టి అత్యంత వెనుకబడిన కులమైన దూదేకుల సామాజిక వర్గానికి అవకాశం కల్పించాలని కోరారు. మైనారిటీలో ఒక భాగమైనటువంటి దూదేకుల సామాజిక వర్గానికి రాబోవు స్థానిక సంస్థల, గవర్నర్ కోటాలో ఒక ఎమ్మెల్సీ సీటు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నాగూరు కుళాయప్ప, అన్నమయ్య జిల్లా అధ్యక్షులు పాపాసాబ్ పాల్గొన్నారు.

అడుగడుగునా ఆంక్షలు

కడప అర్బన్ : రాష్ట్రంలో నారా చంద్రబాబునాయుడు, లోకేష్ పాదయాత్రలకు వస్తున్న ప్రజా ఆదరణ చూసి వైసిపికి వణుకు పడుతోందని, అడుగడుగునా ఆంక్షలు పెట్టినప్పటికీ ప్రజలు తండోపతండాలుగా వస్తున్నారని టిడిపి నగర ఉపాధ్యక్షులు కొండ సుబ్బయ్య అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి రాకముందు ఒక మాట, వచ్చిన తరువాత చేసేది మరొకటి అన్నారు. ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గరపడ్డాయని హెచ్చరించారు.

విద్యార్థుల ప్రాజెక్టులు ఎంపిక

ప్రజాశక్తి -కడప అర్బన్



ఎంపికైన విద్యార్థులతో స్కూల్ డైరెక్టర్ గౌస్ పీర్

సామాన్య శాస్త్రం మీద కేంద్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరమూ నిర్వహించే అతి పెద్ద సైన్స్ కార్యక్రమం ఇన్నోవేషన్ ఇన్ సైన్స్ పర్సుట్ ఫర్ ఇన్‌స్పైర్డ్ రీసెర్చ్. కార్యక్రమానికి పీస్ ఇస్లామిక్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులు ఎంపికయ్యాయని డైరెక్టర్ సయ్యద్ గౌస్ తెలిపారు. పదవ తరగతి చదువుతున్న అబ్దుల్ మతీన్ 'ఆన్‌లైన్ అటెండెన్స్ సిస్టమ్ అండ్ జిఎస్ఎం ప్రాజెక్టు, ఉస్మాన్ 'ఐఒటి బేస్డ్ - అగ్రికల్చర్ వాటర్ మానిటరింగ్ సిస్టం' ప్రాజెక్టు ఎంపికయ్యాయని తెలిపారు. 9వ తరగతి చదువుతున్న రిహన్ 'వెహికల్ ఆక్సిడెంట్ ప్రివేన్షన్ సిస్టం' ప్రాజెక్టు, ముషాహిదా తబస్సుమ్ 'ఐఒటి బేస్డ్ అగ్రికల్చర్ ఫీల్డ్ మానిటరింగ్ రోబోట్' ప్రాజెక్టు ఎంపికమయ్యాయని తెలిపారు. 8వ తరగతి చదువుతున్న ఉజ్మా సుల్తానా 'కరోనా పేషెంట్ మోనిటరింగ్ సిస్టం' ప్రాజెక్టు ఎంపికైందని పేర్కొన్నారు. ఐదుగురు విద్యార్థుల ప్రాజెక్టులు ఎంపిక కావడం చాలా గర్వంగా ఉందని చెప్పారు. ప్రాజెక్ట్స్ అయినా ఖర్చు కేంద్ర ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం

పోరుమామిళ్ల : ప్రతి వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడం కోసం బస్టాండ్ ఆవరణంలో చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని ఆర్‌టిసి డిపో మేనేజర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం బస్టాండ్ ఆవరణలో కమ్మవారిపల్లె గ్రామస్తులు జి.వి.రమణ సహకారంతో పసుపులేటి వెంకటమ్మ జ్ఞాపకార్థం ఉపాధ్యాయుడు జి. శ్రీనివాసులు ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొప్ప మనసుతో, దాతృత్వంతో జిల్లాలో ఎక్కడా లేనివిధంగా ప్రతి సంవత్సరమూ చలివేంద్రం ఏర్పాటు చేసి ప్రయాణికులతో పాటు ఈ ప్రాంత వాసుల దాహార్తిని తీర్చాలనే వారి సేవా దృక్పథం వెలకట్టలేనిదన్నారు. అనంతరం ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు పి.రమణారెడ్డి, రాష్ట్ర ఆర్థిక కమిటీ సభ్యులు బి.బాలరాజు మాట్లాడుతూ మానవసేవయే మాధవసేవ అనే నినాదాన్ని స్ఫూర్తిగా తీసుకుని చలివేంద్రం ద్వారా మంచి సామాజిక సేవ చేస్తున్న దాతలు అభినందనీయులన్నారు.

సమస్యలు లేని విద్యారంగాన్ని రూపొందించాలి


కడప అర్బన్ : సమస్యలు లేని విద్యారంగాన్ని రూపొందించాలని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక సమావేశంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసుల రెడ్డి అన్నారు. శనివారం ఆన్‌లైన్ సమావేశంలో మాట్లాడుతూ రాబోయే విద్యా సంవత్సరం సమస్యలేని విద్యారంగంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వాన్ని కోరారు. అకడమిక్ ప్రారంభం ముందే పూర్తి స్థాయిలో పాఠ్యపుస్తకాల పంపిణీ చేయాలన్నారు. బదిలీ కోడ్ ఉపాధ్యాయులకు రూపొందించి వేసవిలో బదిలీలు, ఉద్యోగోన్నతులు చేపట్టాలన్నారు. వేసవిలోనే ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహించాలని తెలిపారు. అంతకుముందే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని చెప్పారు. సమావేశంలో రాష్ట్ర ఫ్యోర్టో చైర్మన్ కరణం హరికృష్ణ, ఎస్ఎల్‌టిఎ రాష్ట్ర అధ్యక్ష ,కార్యదర్శులు అంకాల కొండయ్య, గాండ్లపర్తి శివానందరెడ్డి, ఆర్‌జెయుపి ముత్తోజి వీరబ్రహ్మం, ఎపి సిపిఎస్ ఇఎ రామాంజనేయులు, ఎపిటిఎఫ్ అశోక్ కుమార్ , ఆపస్ ఎర్రిస్వామి, డిడబ్ల్యుటిఎ పెద్దన్న పాల్గొన్నారు.

ప్రతాప్‌రెడ్డిని వెంటనే సస్పెండ్ చేయాలి : డివైఎఫ్ఐ

బద్వేలు : ఎంఎల్‌సి ఎన్నికల్లో అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ ప్రభుత్వ ఉపాధ్యాయులను భయభ్రాంతులకు గురిచేస్తున్న ఆర్‌జెడి ప్రతాప్ రెడ్డిని వెంటనే సస్పెండ్ చేయాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని డిమాండ్ చేశారు. శనివారం డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌జెడి పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, టీచర్ ఎంఎల్‌సి ఎన్నికలలో అధికార పార్టీకి చెందిన అభ్యర్థులను గెలిపించేందుకు అడ్డదారులు తొక్కుతూ అధికార దుర్వినియోగానికి పాల్పడున్నారని చెప్పారు. ఈ విషయమై ఇప్పటికే ఎన్నికల కమిషన్ కూడా వివరణ కోరిందన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఈ ఎన్నికలను సజావుగా నడిపించాలని, అక్రమాలకు పాల్పడిన అధికారుల పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా నాయకులు ఎస్. ప్రవీణ్‌కుమార్, కె,మస్తాన్, షరీఫ్, జి. రమణారెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.

హోరాహోరీగా క్రికెట్ లీగ్ మ్యాచ్‌లు

ప్రజాశక్తి - కడప



మ్యాచ్‌ను ప్రారంభిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

కెఎస్ఆర్ క్రికెట్ మైదానంలో జరిగిన అండర్-16, 19 విభాగం లీగ్ మ్యాచ్‌లో మొదటి బ్యాటింగ్ చేసిన టీం - ఎ జట్టు బ్యాటింగ్ ఎంచుకొని 28.2 ఓవర్లలో 92 పరుగులకు ఆల్ అవుట్ అయింది. ఆ జట్టులోని షేక్ సమీర్ 23 పరుగులు చేశాడు. టీం -బి జట్టులోని షేక్ ఆదిల్ 3, ఆయుబ్ 3 వికెట్లు తీసుకున్నారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన టీం -బి జట్టు 54.2 ఓవర్లలో 9 వికెట్లు నష్టానికి 341 పరుగులు చేసింది. ఆ జట్టులోని విజయరామిరెడ్డి సెంచరీ(100), సయ్యద్ మహమ్మద్ ఆసిఫ్ 75 పరుగులు చేశారు. ప్రవీణ్ కుమార్ మూడు, నిహాల్ మేడ మూడు వికెట్లు తీసుకున్నారు. కెఒఆర్ఎం క్రికెట్ మైదానంలో జరిగిన మరో మ్యాచ్‌లో అండర్ -12, 14 విభాగంలో మొదటి బ్యాటింగ్ చేసిన టీం- బి జట్టు 52.0 ఓవర్లలో 179 పరుగులకు ఆల్ అవుట్ అయింది. ఆ జట్టులోని ప్రశాంతి 51 పరుగులు చేశారు. టీం- బి జట్టులోని జె. కిషోర్ మూడు వికెట్లు తీసుకున్నాడు. ఆంధ్ర బ్యాటింగ్ దిగిన టీం-బె జట్టు ఆట ముగిసే సమయానికి 56.1 ఓవర్లలో 174 పరుగులకు ఆల్ అవుట్ అయింది. ఆ జట్టులోని ఫైజాన్ 50 పరుగులు చేశాడు. టీం- బి జట్టులోని అక్షత్ 3 వికెట్లు తీసుకున్నాడు. మ్యాచ్లను అసోసియేషన్ సభ్యులు విష్ణుమోహన్ రావు పైడికాల్వ విజయకుమార్ ప్రారంభించారు.

తాహిర్ ట్రోఫీ-2023 విజేత 'కెకెఆర్'

కడప : కడప నగరంలో క్రికెట్ గ్రౌండ్‌లో కడప కింగ్ రైడర్ ఆధ్వర్యంలో జన వికాస్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాహిర్ జన్మదినాన్ని పురస్కరించుకొని నిర్వహించిన తాహిర్ ట్రోఫీ -2023 లో విజేతగా కెకెఆర్ -11 జట్టు విజేతగా నిలిచింది. రన్నర్స్‌గా రైసింగ్ కెకెఆర్- 11 నిలిచింది. శనివారం నిర్వహించిన బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అల్ ఇండియా బ్యాక్ వర్డ్ క్లాసెస్ జిల్లా అధ్యక్షుడు పి వి రమణ, డాక్టర్ సొహైల్ అహ్మద్, డాక్టర్ నాజిముదీన్, విద్య సాధన డిగ్రీ కాలేజెస్ చైర్మన్ మన్సూర్ అలీఖాన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాటా డుతూ గెలుపోటములు సహజమనిఎర్కొన్నారు. క్రీడాకారుల ప్రోత్సాహం కోసం ఇలాంటి ట్రోఫీ నిర్వహించిన కెకెఆర్‌ను, తాహిర్‌ను వారు అభినంది ంచారు. కార్యక్రమంలో జన వికాస్ రాష్ట్ర కార్యదర్శి యునుసు, వాజీద్, వెంకటేష్, వాలేపు శివ పాల్గొన్నారు .

పట్టపగలే మోటర్ బైక్‌కు నిప్పు

ప్రజాశక్తి - వేంపల్లె



పూర్తిగా కాలిపోయిన బైక్

స్థానిక అమ్మవారిశాల వెనుక శనివారం పట్టపగలే మోటర్ బైకుకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. బైకు పూర్తిగా కాలిపోయింది. ఈ నేపథ్యంలో స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు. శనివారం ఉదయం వేంపల్లెలోని ప్రియా తోటకు చెందిన వెంకటరమణ అనే వ్యక్తి ఎపి 39 జెఎక్స్ 8009 నెంబర్ గల మోటర్ బైక్‌ను అమ్మవారిశాల వెనుక పెట్టి సమీపంలో ఉన్న తోటలోకి వెళ్లాడు. తోటలోకి వెళ్లి వచ్చిన కొన్ని గంటల్లోనే పూర్తిగా బైక్ కాలిపోయింది. ఇటీవల వరుసగా మోటర్ బైకులకు, కార్లకు కూడా గుర్తు తెలియని దుండగులు నిప్పు పెట్టిన విషయం విదితమే. పోలీసుల నిఘా సరిగాలేక పోవడంతోనే ఇలా జరుగుతోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. గతంలో అర్ధరాత్రి వేళ వాహనాలకు నిప్పు పెట్టేవారు. ప్రస్తుతం పగలే నిప్పు పెడుతున్నారు. ఇదంతా కావాలనే కొందరు వ్యక్తులు మోటర్ బైకులకు నిప్పు పెడుతున్నట్లు పలువురు చర్చించుకుంటున్నారు. ఇందులో పోలీసులు నిర్లక్ష్యం వహిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా పోలీసు అధికారులు నిఘా పెట్టి నిందితులను అదుపులోకి తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

బ్యాటరీ సర్క్యూట్ వల్లనే : సిఐ

బ్యాటరీ సర్క్యూట్స్‌తో బైక్ కాలిపోయిందని సిఐ వెంకటేశ్వర్లు తెలిపారు. అమ్మవారిశాల సమీపంలో ఉన్న సిసి కెమెరాలు చూడగా ఆప్రాంతాంలో ఎవరూ తీరగలేదని చెప్పారు. బ్యాటరీ సర్క్యూట్స్‌తో బైకు కాలి పోయినట్లు తెలిసిందని పేర్కొన్నారు. శబ్దం రాగానే బాధితులు పోయి చూడగా బైక్ కాలి పోతున్నట్లు బాధితులు చెప్పారన్నారు.

రసవత్తరంగా బండలాగుడు పోటీలు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

మండలంంలోని మోటునూతలపల్లి గ్రామ సమీపంలో ఉన్న శ్రీ కోనగవేశ్వర స్వామి క్షేత్రంలో మహాశివరాత్రిని పురస్కరించుకొని శనివారం దేశపు ఎద్దుల బండలాగుడు పోటీలను ఆలయ నిర్వహకులు ఓబుల్‌రెడ్డి ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైసిపి పులివెందుల నియోజకవర్గ ఇన్‌ఛార్జి వైఎస్ భాస్కర్‌రెడ్డి ఈ పోటీలను ప్రారంభించారు. ఈ పోటీల్లో గెలుపొందిన ఎడ్ల యజమానులకు మొదటి బహుమతి రూ.25,000, రెండో బహుమతి రూ.20,000, మూడవ బహుమతి రూ.15,000, నాలుగో బహుమతి రూ.10,000, ఐదో బహుమతి రూ.8000, ఆరో బహుమతి రూ.5000, ఏడో బహుమతి మూడు వేల రూపాయలు నగదును భాస్కర్‌రెడ్డి చేతుల మీదుగా అందజేయించారు. కార్యక్రమాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల వారు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ నిర్వాహకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



ఎడ్ల పోటీలను ప్రారంభిస్తున్న వైఎస్ భాస్కర్‌రెడ్డి

సేవాభావంతో అనాథ వృద్ధులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - వేంపల్లె

పిల్లల ప్రేమభిమానులు కోల్పోయిన అనాథ వృద్ధులను ప్రతి ఒక్కరూ ఆదుకోవాలని గాలి హరిప్రసాద్ కోరారు. స్థానిక రాజీవ్ నగర్ కాలనీలోని మదర్ థెరీసా వృద్ధాశ్రమంలో శనివారం గాలి వెంకటరమణ వర్ధంతి సందర్భంగా అన్నదానం చేశారు. వృద్ధులకు పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ సమాజంలోని అనాథల పట్ల సేవా తత్పరత చూపాలన్నారు. తన తండ్రి గాలి వెంకటరమణ వర్ధంతిని పురస్కరించుకొని ప్రతి ఏడాది అన్నదానం చేయడం అనావాయితీగా పెట్టుకొన్నట్లు చెప్పారు. 25ఏళ్లుగా అనాథ వృద్ధులకు ఆశ్రమ నిర్వాహకుడు సేవ చేయడం సంతోషదగ్గ విషయమన్నారు. అనంతరం ఆశ్రమ నిర్వాహకుడు వెంకట సుబ్బయ్యను శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో సుష్మా, సునీల్ కుమార్, పసుపులేటి నాగేంద్ర, అతికారి ప్రసాద్, పద్మ రవితేజ పాల్గొన్నారు.



వెంకట సుబ్బయ్యను సన్మానిస్తున్న దాత గాలి హరిప్రసాద్

శిల్పారామంలో సందడే సందడి

పులివెందుల టౌన్ : శివరాత్రి పర్వదిన సందర్భంగా శనివారం శిల్పారామంలో నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఫాతిమా మెడికల్ స్టోర్, పులివెందుల పాలగిరి ప్రదీప్ (పి.ఆర్) సియోన్‌పురం సౌజన్యంతో అంకాలమ్మ మెమోరియల్ హైస్కూల్, వేల్పుల గ్రామానికి చెందిన చిన్నారులచే శ్రీ చిట్టి డ్యాన్స్ మాస్టర్ అధ్వర్యంలో జనపదం, వెస్ట్రన్ నృత్య ప్రదర్శనలు చేశారు. కార్యక్రమంలో పరిపాలనా అధికారి సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న చిన్నారులు

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

ప్రొద్దుటూరు : స్థానికంగా ఉన్న 'మే ఐ హెల్ప్‌యు ఫౌండేషన్' నిర్వాహకులు శనివారం అనాథ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. ప్రొద్దుటూరు ఆటోనగర్‌లో ఉన్న రామకృష్ణ అనే అనాథ అనారోగ్యంతో మృతి చెందాడు. స్థానికులు ఫౌండేషన్ చైర్మన్ లక్షణ్‌మోరేను సంప్రదించారు. వెంటనే స్పందించి హిందూ శ్మశానవాటికలో హిందూ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు చేశారు. కార్యక్రమంలో సిఐఇ మల్లికార్జున, ప్రొద్దటూరు అధ్యక్షుడు కామనూరు శివసాయినాథ్, తాళ్లమాపురం కానిస్టేబుల్ భాస్కర్, అనీఫ్, సుబహాన్, సుబ్బయ్య పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఆటోను ఢీకొన్న కారు : ఏడుగురికి గాయాలు

- సంగమేశ్వరాలయానికి వెలుతుండగా ఘటన

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక కడప రోడ్డులో ఉన్న సంచులు ప్యాక్టరీ వద్ద శనివారం ఆటోను కారు ఢీకొన్న సంఘటనలో ఏడుగురు గాయపడ్డారు. వివరాలోకి వెళ్లితే.. మహాశివరాత్రి సందర్భంగా వేంపల్లెకు చెందిన మహిళలు వీరపునాయునిపల్లె మండలంలోని సంగమేశ్వర ఆలయం వద్దకు శనివారం సాయంత్రం ఆటోలో బయల్దేరారు. సంచుల ప్యాక్టరీ వద్దకు రాగానే వెనుక వైపు నుంచి కారు వేగంగా ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న లహరి, జ్యోష్న, గౌతమి, దివశ్రీ, లక్ష్మిదేవి, సుబ్బలక్షుమ్మ, రిషిత తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే 108 ద్వారా వేంపల్లె ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. లహరికి తీవ్ర గాయాలు కావడంతో 108 ద్వారా కడపకు తరలించారు. గాయపడిన వారిని వేంపల్లి ప్రభుత్వాసుపత్రిలో జడ్‌పిటిసి రవికుమార్‌రెడ్డి పరామర్శించారు. కారు డ్రైవరును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.





108లో తీవ్రంగా గాయపడిన లహరి, చికిత్స పొందుతున్న మహిళ

ప్రజాధనం నిరుపయోగం

ప్రజాశక్తి - జమ్మలమడుగు

పట్టణంలోని సంజామల మోటు దగ్గర ఏర్పాటు చేసిన కూరగాయల మార్కెట్ నిర్మాణం దాదాపు రూ.6.50 లక్షలతో ఏర్పాటు చేశారు. ఇది ప్రజలకు నిరుపయోగంగా మారింది. కరోనా నేపథ్యంలో కూరగాయల మార్కెట్‌ను పట్టణంలోని నలుమూలల విస్తరింపజేశారు. ఇందులో భాగంగా సంజామల మోటులోని ప్రభుత్వ స్థలంలో ప్రజాధనంతో మున్సిపల్ అధికారులు నూతన మార్కెట్‌ను నిర్మించారు. దీన్ని గతేడాది ఏప్రిల్ 7న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ప్రారంభించారు. అప్పటి నుంచి మార్కెట్ నిర్వాహకులు వారికి కేటాయించిన ప్రాంతంలో కూరగాయలను విక్రయించడం లేదు. కానీ నూతనంగా నిర్మించిన మార్కెట్‌కు ఎదురుగా ప్రయివేట్ స్థలాల్లో, బండ్లపైన ప్రధాన రోడ్డు పక్కన ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తూ కూరగాయలను విక్రయిస్తున్నారు. దీంతో ప్రజల సొమ్మును వెచ్చించి కట్టిన కూరగాయల మార్కెట్ నిరుపయోగంగా మారింది. నూతనంగా నిర్మించిన కూరగాయల మార్కెట్ వ్యర్థాలతో నిండిపోయింది. ఆవులకు, పందులకు నిలయంగా మారింది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు మార్కెట్ నిర్వాహకులకు కేటాయించిన స్థలాల్లో కూరగాయలను విక్రయించేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



నిరుపయోగంగా ఉన్న మార్కెట్ ప్రదేశం

లక్ష్యంతో చదివితే ఉన్నత స్థాయికి..





పాల్గొన్న విద్యార్థులు, జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కరస్పాండెంట్ బీరం సుబ్బారెడ్డి

ప్రజాశక్తి - ఖాజీపేట

ప్రతి విద్యార్థి లక్ష్యంతో ప్రణాళిక ప్రకారం చదివితే ఉన్నతస్థాయికి చేరుకుంటారని ఎంపిడిఒ రామనాథరెడ్డి తెలిపారు. మండలంలోని కొత్త నెల్లూరు సమీపంలోని బీరం శ్రీధర్ రెడ్డి పాఠశాలలో శనివారం వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా జిల్లా డైరెక్టర్ భార్గవ్‌రెడ్డి, ఎంపిడిఒ రామనాథ్‌రెడ్డి, మరో ఎంపిడిఒ శ్రీకాంత్‌రెడ్డి విచ్చేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ బీరం సుబ్బారెడ్డి, చైర్ పర్సన్ సరస్వతమ్మ మాట్లాడుతూ ఒక చిన్న విత్తనంలా మొదలైన పాఠశాల నేడు ఒక మహావృక్షంలా ఎదిగిందన్నారు. తమ విద్యా సంస్థల విద్యార్థులను దేశం గర్వించదగ్గ స్థాయిలో తీర్చిదిద్దడానికి అహర్నిశలు తపిస్తామని పేర్కొన్నారు. తమ విద్యా సంస్థల అభివృద్ధికి తోడ్పాటు నందిస్తున్న తల్లిదండ్రులకు, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. విద్యా సంస్థల డైరెక్టర్ స్వాతి శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించడానికి కావలసిన అన్ని సౌకర్యాలు తమ పాఠశాలలో ఉన్నాయన్నారు. దేశానికి మంచి పౌరులను అందజేయడమే తమ లక్ష్యమన్నారు. ఆ మేరకు నిరంతర విద్యార్థిలా తాము శ్రమిస్తూంటామన్నారు. జెఇఇ మెయిన్స్ 2023 ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థులు జాతీయస్థాయిలో ర్యాంకులు సాధించారని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ భాస్కర్‌రెడ్డి, హైస్కూల్ ప్రిన్సిపల్ శ్వేతా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకొస్తే 'ఆరు సూత్రాలు' అమలు

ప్రజాశక్తి - మైలవరం

రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్రంలో ఆరు సూత్రాల కార్యక్రమాన్ని అమలు చేస్తుందని పిసిసి మీడియా సెల్ చైర్మన్ డాక్టర్ ఎన్.తులసిరెడ్డి తెలిపారు. మండలంలోని జి.ఉప్పలపాడు గ్రామంలో శనివారం ఆయన పర్యటించారు..ఈ సందర్భంగా అక్కడ అభయాంజనేయ స్వామి గుడి దగ్గర పూజ చేశారు. అనంతరం తులసిరెడి మాట్లాడుతూ రాష్ట్ర సర్వతో అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ తోడ్పడుతుందని తెలిపారు. పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని వివరించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మూడు లక్షల రూపాయల వరకు వ్యవసాయ రుణాలను మాఫీ చేస్తామన్నారు. గ్యాస్ సిలిండర్ రూ.500కే పంపిణీ చేస్తామని తెలిపారు. ప్రతి నిరుపేద కుటుంబానికి నెలకు రూ.6000 ఆర్థికసాయం అంది స్తామన్నారు. ప్రత్యేకహోదా కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు సుబ్రహ్మణ్య శర్మ, మైలవరం మండలశాఖ అధ్యక్షులు శ్రీని వాసులు, జానకిరామ్, అమర్నాథ్‌రెడ్డి, ఉత్తన్న, నరసింహారెడ్డి, శివయ్య పాల్గొన్నారు.



నాయకులతో కలిసి మాట్లాడుతున్న ఎన్.తులసిరెడ్డి

దిగజారుతున్న ప్రజాస్వామ్యం : టిడిపి



జమ్మలమడుగులో నల్లబ్యాడ్జీలతో నిరసన చేస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

వైసిపి ప్రభుత్వ పాలనలో ప్రజాస్వామ్యం రోజురోజుకూ దిగజారిపోతోందని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు భూపేష్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం నల్ల బ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం అనపర్తిలో చంద్రబాబు పర్యటనను అడ్డుకోవడం ప్రజాస్వామ్య వ్యతిరేకమన్నారు. 14 నెలల్లో ముఖ్యమంత్రి ఇంటికెళ్లనున్నట్లు తెలిపారు. ప్రభుత్వాలు వస్తాయి.. పోతాయన్నారు. ప్రతిపక్షం లేకుండా పాలన సాగించాలనుకోవడం ప్రభుత్వానికైనా సరైందికాదన్నారు. అధికార, ప్రతిపక్షం ఉంటేనే ప్రజాస్వామ్యం అభివృద్ధి చెందుతుందన్నారు. పోలీసులు కూడా చూసుకొని ఆంక్షలు విధించాలన్నారు. ఎప్పుడు ఒకే ప్రభుత్వం ఉండదని గుర్తుపెట్టుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పనితీరును అధికారులు, ప్రజలు గమనించాలన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి జంబాపురం రమణారెడ్డి, ఎస్‌టి నాయకులు హనుమంతు నాయక్, కిరణ్ రాయల్, వెల్డింగ్ గైబు, సర్దార్, పొన్నతోట బ్రదర్స్ శ్రీను, మల్లి, తులసిరెడ్డి, నెల్సన్, రఫీ, శివారెడ్డి పాల్గొన్నారు.

వేంపల్లె : రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి తెలిపారు. అనపర్తిలో టిడిపి అధినేత చంద్రబాబు రోడ్‌షోను పోలీసులు అడ్డుకున్నందుకు నిరసనగా శనివారం రామమునిరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక టిడిపి కార్యాలయం నుండి నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న అంబేద్కర్ విగ్రహం వరకు నల్ల బ్యాడ్జీలు ధరించి, ప్లకార్డులతో ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా పలు నినాదాలు చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, ఈ ప్రభుత్వ ఆరాచకాలపై వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టిడిపి ఎస్‌టి సెల్ జిల్లా అధ్యక్షుడు మేదర రవికుమార్, టిడిపి పట్టణ అధ్యక్షుడు ఆర్‌వి రమేష్, మైనార్టీ మండల కన్వీనర్ తెలంగాణ వలి, ఉపాధ్యక్షుడు వీరభద్ర, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఇనాయతుల్లా, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎద్దుల శేషారెడ్డి, జిల్లా మైనార్టీ కార్యదర్శి పూల అల్లాబక్షు, దక్కా రమేష్, గొగుల మల్లికార్జున, యుగంధర్, యూనిట్ నెంబర్ గిరిధర్‌రెడ్డి, మడక శ్రీను, మైనార్టీ కార్యదర్శి సైపుల్లా, రామాంజనేయులు, ఈశ్వరయ్య, మారుతీ పాల్గొన్నారు.

శైవక్షేత్రాల్లో పోటెత్తిన భక్తజనం



పొలతలలో స్వామి దర్శనానికి క్యూలో భక్తులు

ప్రజాశక్తి - పెండ్లిమర్రి

మహాశివరాత్రి పవిత్ర దినాన్ని పురస్కరించుకొని మండల పరిధిలోని పొలతల క్షేత్రం భక్తులు, యాత్రికులతో కిటకిటలాడింది. శివనామస్మరణతో మార్మోగినది. శనివారం తెల్లవారుజాము నుంచి భక్తులు శ్రీ మల్లేశ్వర స్వామిని దర్శించుకున్నారు. మల్లేశ్వర స్వామి దర్శించుకున్న భక్తులు పార్వతి దేవి అక్కదేవతలు వద్ద వరపడ్డారు. ఆలయ అధికారులు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దర్శనం కోసం క్యూలైన్లు ఏర్పాటు చేశారు. పలువురు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలీసులు ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు చోటు చేసుకోకుండాబందోబస్తును నిర్వహించారు.

వైభవంగా కల్యాణోత్సవం

మహాశివరాత్రి పర్వదినాన పురస్కరించుకొని శనివారం పోలతల క్షేత్రంలో వైభవంగా శివపార్వతుల కల్యాణోత్సవాన్ని వేద పండితులు నిర్వహించారు. ప్రభుత్వం తరపున స్థానిక ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి దంపతులు పట్టు వస్త్రాలను స్వామివారికి సమర్పించారు. అనంతరం వేదపండితులు శాస్త్రవేత్తంగా మంగళ వాయిద్యాలు నడుమ శివపార్వతుల కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

ఒంటిమిట్ట : శివరాత్రి సందర్భంగా శనివారం ఉదయం నుంచి శివాలయాలు శివనామ స్మరణతో మార్మోగాయి. ఒంటిమిట్టలోని కాశీ విశ్వేశ్వర శివాలయం దగ్గర పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు మండల పరిధిలోని కొత్త మాధవరం దగ్గర మృకుంద ఆశ్రమంలోని శివాలయంలో భక్తులు స్వామివారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు

పోరుమామిళ్ల టౌన్: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మండలంలో ప్రజలు మహాశివరాత్రి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. సిద్ధవరం గ్రామంలో వెలసిన శ్రీ సిద్ధేశ్వర స్వామి సిద్ధులు క్షేత్రంలో శ్రీ శివ పార్వతి పరమేశ్వర కల్యాణం వైభవంగా నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఎంతగానో ఆకట్టుకున్నాయి.

అల్లాడుపల్లెలో అన్నదాన కార్యక్రమం



అన్నం వడ్డిస్తున్న నిర్వాహకులు

చాపాడు : అల్లాడుపల్లె వీరభద్రస్వామి దేవస్థానం ఆవరణలో భద్రకాళి సమేత వీరభద్ర స్వామి అన్నదాన సత్రంలో శివరాత్రి సందర్భంగా శనివారం నిత్య అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అల్లాడుపల్లె సర్పంచు కిషోర్‌కుమార్‌రెడ్డి, లక్ష్మీపేట చంద్రమోహన్‌రెడ్డి అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అన్నదాన సత్రానికి దాతలు వివిధ రకాల వస్తువులు, నగదు రూపంలో వితరణ చేశారు. అలాగే ఆర్యవైశ్య అన్నదాన సత్రంలో దొంతు సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సర్వజన అన్నదాన సత్రంలో, విశ్వబ్రాహ్మణ సర్వజన అన్నదాన సత్రంతోపాటు కొంతమంది భక్తులు స్వచ్ఛందంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారం కూడా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశామని నిర్వాహకులు తెలిపారు.

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని అల్లాడుపల్లె దేవలాయ ఆవరణం శనివారం శివ నామస్మరణతో మార్మోగింది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. తెల్లవారుజాము నుండి స్వామివారికి ప్రత్యేక అలంకరణ, అర్చనలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా ఇఒ శ్రీనివాసులు, ఆలయ చైర్మన్ జిటి వెంకటసుబ్బారెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు తహశీల్దార్ సుభాని, ఎస్ఐ కెసి రాజు, ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. రాత్రి జాగరణకు వచ్చే భక్తుల కోసం అన్ని రకాల ఏర్పాట్లు చేపట్టారు. మండల వైద్యాధికారి రాజేష్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రథమ చికిత్స కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు. వీరభద్ర స్వామి జిల్లాలోని వివిధ ప్రాంత ప్రజలతోపాటు పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు.

వైభవం.. శ్రీ దుర్గా గవి మల్లేశ్వరుడి గ్రామోత్సవం

వేంపల్లె : మహ శివరాత్రి పండుగను పురస్కరించుకుని వేంపల్లెలో శ్రీ పాపాఘ్ని నది ఒడ్డున వెలసిన శ్రీ దుర్గా గవి మల్లేశ్వరస్వామి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. స్థానిక గవి మల్లేశ్వరస్వామి ఆలయం వద్ద నుండి వేంపల్లెలోని పుర వీధుల్లో స్వామి విగ్రహాన్ని ప్రత్యక అలంకరణతో ఊరేగించారు. మహ శివరాత్రి కావడంతో గవి మలేశ్వర స్వామి ఆలయ ప్రాంతం మహిళాలతో కిక్కిరెక్కింది. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రాఘవేంద్రప్రసాద్, నారాయణ, చంద్రశేఖర్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రాజారావు, రామలింగయ్య, సుబ్బారావు, హరికృష్ణ, దొంతు సతీష్ పాల్గొన్నారు.

పులివెందుల రూరల్ : శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం పలు శైవ క్షేత్రాల వద్ద పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలను ఆయా ఆలయ ధర్మకర్తలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీమిత మల్లేశ్వర స్వామి, నామాల గుండు, గుండాలయ్య కోన, పంచలింగాల కోనకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆయా కార్యక్రమాల్లో పోలీసులు గట్టి భద్రతాచర్యలు చేపట్టారు.

జమ్మలమడుగు రూరల్ : మండల పరిధిలోని కన్యతీర్థానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో శివుడ్ని దర్శించుకున్నారు. వీరి సౌకర్యార్థం ఆర్‌టిసి కన్యతీర్థానికి, మైలవరం మండలంలోని అగస్తేశ్వరకోనకు ప్రత్యేక బస్సులు నడిపారు. రెండు పుణ్యక్షేత్రాల్లో అన్నదానం చేశారు. పట్టణంలోని ఓంకారేశ్వర స్వామి దేవాలయం, శివాలయంలో అభిషేకం చేశారు. రాత్రి జాగారం చేసే భక్తుల కోసం నాటకాలు ప్రదర్శించారు.



జమ్మలమడుగు రూరల్ : కన్యతీర్థంలో బారులుదీరిన భక్తులు

ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి - చాపాడు



వివిధ వేషధారణలో ఆకట్టుకున్న విద్యార్థులు

స్థానిక ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో శనివారం మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన పరమశివుని నృత్యాలు, పార్వతి పరమేశ్వరుల వేషధారణ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో భాగంగా పాఠశాల చైర్మన్ డాక్టర్ బి.జయచంద్రారెడ్డి, పాఠశాల డైరెక్టర్ వి.లోహిత్‌రెడ్డి మహాశివరాత్రి విశేషాలను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ రాధా ఎంకె నాయర్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కల్యాణ మండపానికి భూమిపూజ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

మండలంలోని నంగునూరుపల్లె గ్రామ శివాలయంలో రూ.70 లక్షల వ్యయంతో నిర్మించే కల్యాణమండపానికి శనివారం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాభివృద్ధే ధ్యేయంగా జగనన్న ప్రభుత్వం పని చేస్తోందన్నారు. తన వంతుగా రూ.30 లక్షలు ఇస్తున్నట్లు ప్రకటిం చారు. అనంతరం శివపార్వతుల కల్యాణమహోత్సవంలో పాల్గొనారు. కార్యక్రమంలో ఎంపిపి సానబోయిన శేఖర్ యాదవ్, జిల్లా తోటవీరసంఘం అధ్యక్షుడు బండారు సూర్య నారాయణ, భవన నిర్మాణ సొసైటీ బ్యాంకు చైర్మన్ గోపిరెడ్డి రమణయ్య, వైసిపి నాయకుడు కల్లూరు మురళీనాథరెడ్డి, వైపిపి ఇన్‌ఛార్జి యాలం శంకర్ యాదవ్, గ్రామ సర్పంచు లక్ష్మీదేవి వెంకటరాముడు, ఎంపిటిసి క్రిష్టిపాటి సంధ్య, మంజునాథ శర్మ, ఉపసర్పంచు గంగయ్య, దేవాలయ కమిటీ మెంబర్లు డాక్టర్ గురప్ప, నడిఎం గురప్ప, బైరీగాని నాగార్జున, బి.నాగముణి, బి.బాలయ్య, రంగయ్య నాయుడు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు

దేశాన్ని అమ్మేది, కొనేది గుజరాతీయులే

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన మన భారతదేశాన్ని అమ్మేది, కొనేది గుజరాత్ రాష్ట్రానికి చెందిన వారే అని, కేంద్రంలోని బిజెపి ఈ స్థితికి దిగజార్చిందని కాంగ్రెస్ నాయకులు విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ వినూత్నంగా చేపట్టిన 'హత్ సే హత్ జోడో అభియాన్' కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక కళ్యాణమండపంలో వారు విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణ అధ్యక్షుడు న్యాయవాది జిలాన్ మాట్లాడుతూ దేశప్రజల సంపదైన ప్రభుత్వ రంగ సంస్థలను గుజరాత్‌కు చెందిన ప్రధాని మోడీ, హోం మినిస్టర్ అమిత్‌షా అమ్ముతుంటే.. అదే గుజరాత్‌కు చెందిన అదాని, అంబాని కొంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాటి ప్రధానులు నెహ్రూ, ఇందిరాగాంధీ త్యాగఫలితమే నేటి దేశ అభివృద్ధి తెలిపారు. నియోజకవర్గ సమన్వయకర్త మల్లెం విజయభాస్కర్ మాట్లాడుతూ ప్రధాని మిత్రులు ఇక్కడి బ్యాంకులను లూటీ చేసి విదేశాలకు పారిపోతున్నారని తెలిపారు. ఎన్నికల ముందు ప్రధాని చేసిన వాగ్దానాలు ఏవీ అమలు చేయలేదన్నారు. రాష్ట్రంలో జగన్ పాలన తుగ్లక్ పాలనను మరిపిస్తోందని విమర్శించారు. ఇదేమని ప్రశ్నిస్తే పోలీసులతో వేధింపులన్నారు. కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు క్షేత్ర స్థాయి నుండి బలోపేతం చేస్తామన్నారు. మరో సమన్వయకర్త ఆరిఫ్ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాజస్థాన్‌లో గ్యాస్ సిలిండర్ ధర రూ.500 ఉంటే మన దేశంలో రూ.1200 ఉందని పేర్కొన్నారు. ప్రజారంజకంగా పాలించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందాయన్నారు. రాహుల్‌గాంధీని ప్రధానిని చేసేందుకు అందరం కలిసికట్టుగా కృషి చేస్తామన్నారు. మైనార్టీ విభాగ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఫి మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు దేశభక్తులని, బిజెపి నాయకులు దేశద్రోహులన్నారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి నజీర్ మాట్లాడుతూ రాహుల్ పాదయాత్రకు అనుబంధంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. అనంతరం కార్యకర్తల సమావేశం నిర్వహించారు.



అభివాదం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు